**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
తేది : 29 జూన్, 2019.

## పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు కోసం సిపిఐ(యం) విజ్ఞప్తి

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ సమావేశం జూన్ 24-25తేదీలలో యం ఏ గఫూర్ అధ్యక్షతన విజయవాడలో జరిగింది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సమీక్షత, అనంతర పరిస్థితిపై చర్చించి ఈ కింది తీర్మానాన్ని అమోదించింది.**

వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైయస్సార్ కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే వాగ్దానాల అమలుకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల అమలుకు అనేక సానుకూల నిర్ణయాలను ప్రకటించడం ముదావహం. అమ్మఒడి పథకం కింద తల్లులకు పదిహేను వేలు ఇవ్వడం, ఆశాలకు, పారిశుద్ధకార్మికులకు వేతనాలు పెంచడాన్ని సిపిఐ(యం) హర్షిస్తున్నది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కూడా హర్షణీయమే. సిపిఎస్ రద్దు చేస్తామని ప్రకటించింది. రేషన్ ను నేరుగా ఇండ్లకే డెలివరీ ఇస్తామని చెపుతోంది. కొత్తగా ఇసుక విధానం, మద్యం అమ్మకాల నియంత్రణ ప్రకటించింది. పోలవరం, రాజధాని నిర్మాణాలపై విచారణ జరపాలని నిర్ణయించింది. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం పెంచి వెంటనే పునరావాసానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆరోగ్యశ్రీని రు. 1000ల పైన అయ్యే వైద్యానికి విస్తరించడం మంచి పరిణామమే. రెండేండ్లలో అన్ని ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను మెరుగుపరుస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలు అర్హులైన ప్రజలకు చేరడానికి ప్రయత్నించాలి. ఈ పథకాలు పారదర్శకంగా, పక్షపాత రహితంగా అమలయ్యేట్లు చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల మధ్య నున్న వివిధ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీసుకున్న చొరవను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఆహ్వానిస్తున్నది. ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డిగారు వాగ్దానం చేసినట్లుగా ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను నిలిపివేస్తూ జివో నెంబరు 97ను రద్దు చేయడం పట్ల సిపిఐ(యం) హర్షం వ్యక్తం చేస్తున్నది.

అమ్మఒడి పథకం పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులను ప్రోత్సహించడానికి తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. అయితే ప్రభుత్వ విద్యాలయాల్లో టీచర్ పోస్టులు భర్తీ చేసి ప్రమాణాలను మెరుగుపరచకుంటే క్రమంగా అవి దెబ్బతింటాయి. తల్లిదండ్రులు ప్రైవేటుపాఠశాలల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ప్రభుత్వ విద్య దెబ్బతింటే పేదలకు చదువే దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ విద్యాలయాలు మూతపడతాయి. అమ్మఒడి పథకంతో పాటు ప్రభుత్వ విద్యను బలపరిచేందుకు ఏకకాలంలో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ప్రభుత్వ విద్య బలహీనపడితే ఏ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నేడు అమ్మఒడిని ప్రారంభించిందో ఆలక్ష్యమే దెబ్బతింటుంది. అందువల్ల ఈ పథకం అమలుకు (ఉపాధ్యాయ, విద్యార్థి, తల్లిదండ్రుల సంఘాలు) సంప్రదించి ఆపైన దీనికి తుది రూపం ఇవ్వాలని సిపిఐ(యం) రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తున్నది. ప్రభుత్వ విద్యను బలపరచాలని, పాఠశాలల్లో సౌకర్యాలను, నాణ్యతను పెంచాలని కోరుతో జులై మొదటివారంలో రాష్ట్ర వ్యాపితంగా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర కమిటీ అన్ని పార్టీ శాఖలను కోరింది.

గ్రామ, పట్టణ వలంటీర్ల నియామకంలో విద్యార్హతలను, రిజర్వేషన్లను ప్రకటించింది. ఇది మంచిదే. అయితే ఇంటర్వ్యూ ద్వారా నియామకాలు జరుగుతాయని ప్రకటించారు. ఇది అక్రమాలకు, పక్షపాత నిర్ణయాలకు దారి తీసే ప్రమాదం ఉంది. అందువల్ల ఇంటర్వ్యూలు లేకుండా వారికొచ్చిన మార్కులు ఆధారంగా నియామకాలు సాగించాలని కోరుతున్నాం.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే బాధ్యతను అక్షయపాత్ర (ఇస్కాన్) కు అప్పగించి కేంద్రీకృత వంటశాలల ద్వారా 40 కి.మీ దూరంలోని స్కూళ్లకు పంపిణీ చేయాలని ప్రభుత్వం చేసిన నిర్ణయం మధ్యాహ్న భోజన కార్మికుల్లో, విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే ఇస్కాన్ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న భోజనం సరిగ్గా లేదని ఫిర్యాదులున్నాయి. విశాఖలో అక్రమంగా బియ్యం తరలించిన కేసులో ఈ సంస్థ ఆరోపణలు ఎదుర్కొంటున్నది. ఈ స్థితిలో రాష్ట్ర వ్యాపితంగా వంటలొండే బాధ్యతను దానికి అప్పగించడం శ్రేయస్కరం కాదు. తక్షణం ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకొని పాఠశాలల్లోనే ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ఆహారం తయారు చేయించి పిల్లలకు పంపిణీ చేయాలని కోర్తున్నాం.

వైయస్ఆర్ రైతు భరోసాతో సహా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హామీలు, సహాయాలన్నింటినీ కౌలు రైతులకు కూడా వర్తింప చేయాలని కోరుతున్నాం. 2011 కౌలురైతుల చట్టంలో మార్పులు చేయబోతున్నట్లుగా వార్తలొస్తున్నాయి. కౌలురైతు సంఘాలతో చర్చించిన తర్వాత వారి విజ్ఞప్తులను కూడా పరిగణనలోకి తీసుకొని ఈ చట్టాన్ని కౌలు రైతులకు ఉపయోగపడేవిధంగా పకడ్బందీగా రూపొందించాలని కోర్తున్నాం. జులై ఆఖరులోగా కౌలురైతులకు గుర్తింపు కార్డులిచ్చేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సంసిద్ధం చేయాలి.అర్హులైన వాస్తవ సాగుదార్లకు రుణార్హత కార్డులివ్వాలని కోర్తున్నాం. రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభనివారణకు, వ్యవసాయాభివృద్ధికి ఇది చాలా అవసరం. గత ప్రభుత్వం బాండ్లు కూడా ఇచ్చిన 4, 5 విడతల రుణ మాఫీ నిధులను రైతులకు అందించాలి.

పట్టణాలలో గృహాల కేటాయింపు కోసం ఎన్నికలకు ముందే డిపాజిట్ చేసిన వారిలో ఆందోళన కలుగుతోంది. స్కీం కొనసాగుతుందా లేదా అన్న అనుమానాలున్నాయి. పాత స్కీంలను యధావిధిగా కొనసాగించాలి. పలు రకాల నిర్మాణ పనులు ఆపేయడం వలన ప్రజలు ఉపాధి కోల్పోతున్నారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలి. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వాగ్దానం చేసినట్లుగా వివిధ రంగాలలో పని చేస్తున్న స్కీం వర్కర్స్, అసంఘటిత, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం. వారికి ఉద్యోగభద్రత కల్పించాలి. అనేక ప్రాంతాల్లో మధ్యాహ్నభోజన కార్మికులు, ఆశాలు, యానిమేటర్లు తదితర కాంట్రాక్టు కార్మికులను రాజకీయ కారణాలపై తొలగిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు పని చేస్తున్న వారిని యధావిధిగా విధుల్లో కొనసాగించాలని, వారిలో అభద్రతా భావాన్ని తొలగించాలని కోర్తున్నాం. ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఇసుక విధానం ఇంకా అమల్లోకి తేనందున నిర్మాణ పనులు ఆగిపోయి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. వెంటనే ఇసుక సరఫరాను పునరుద్దరించి కార్మికులను ఆదుకోవాలని నూతన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి